



**గాలి** ఉద్ధృతికి అలవోకగా ఎగిసి ఎగిసిపడుతూ చెట్టుకొమ్మన వాలింది ఓ వంద నోటు. రెపరెపలాడుతున్న చప్పుడు విని పక్కనే ఉన్న గూటిలోంచి ఓ పావురం తలని కాస్త బైటపెట్టి వేటగాడని కాబోలు గుబులుగా చూసింది. నోటుని చూసి ఏం పర్లేదులే అనుకుని ధైర్యంగా బైటికి వచ్చింది.

"హమ్మయ్య! ఈ గాలిదేవుడి పుణ్యమా అని కొంతసేపు ఊపిరి పీల్చుకునే సమయం దొరికింది" అంది పైకి వంద నోటు. ఆ మాటలు విన్న పావురం -

"ఊపిరి పీల్చుకోలేనంత బిజీయా?"

నోటు, పావురం వైపు తల తిప్పి -

'ఔను మరి! ఏవరైనా నన్నిలా వూరికే గాలికొదిలేంతా ధైర్యం చేస్తారా? ఛస్తే చెయ్యరు. కాకపోతే, వారివారి తాహతుబట్టి, పెట్టెలోనో, లాకరులోనో, బీరువాల్లోనో, జేబుల్లోనో, గాలి దూరనంతగా, నాకు ఊపిరి తీసుకునే సందివ్వక, బంధించరూ?" అదీగాక, ప్రాణంకన్నా ఎక్కువగా, నా పైనే దివరాత్రులు కన్ను వేసుంచరూ?" అంది నోటు చివరను

వయ్యారంగా రెపరెపలాడిస్తూ. "పోదూ! బలే బడాయి పోతున్నావ్. గాలి వాటుకు ఎటు అంటే అటు వెళ్ళిపోయే నీకు మాటలు బాగానే వచ్చినట్లుంది" అంది పావురం. ఇంతలో గాలికి రెపరెపలాడుతున్న నోటు చివరన కాస్త చినిగింది. అది చూసి పావురం పకీ పకీ నవ్వింది. మనసు చిన్నబుచ్చుకున్న నోటు. "ఔను పావురమా! నా మాటలు నమ్ము. నేను గాలికి కొట్టుకుపోయే కాగితం ముక్కను, కాదనను. కానీ నేనీ లోకాన్ని శాసిస్తున్నాను. తెలుసా! భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుందంటారు. కానీ నిజం చెప్పాలంటే, ఈ ప్రపంచం నా చుట్టే తిరుగుతోంది తెలుసా! ఈ మాట ఎంత నిజమంటే నువ్వు శాంతికి చిహ్నానివి అన్నమాట ఎంత నిజమో, అంత నిజం."

"కొట్టు కొట్టు! చెప్పేవాడికి వినేవాడు లోకువంటారుగా!"

"అంటే నా మాటలు అబద్ధమంటావా?"

"ముమ్మాటికీ అబద్ధమే. మానవత విలువల ముందు, మాననీయ బంధాలముందు నీవెంత?"

పావురం మాట వినగానే ఈసారి నోటు పగలబడి నవ్వింది. కాసేపటికి ఆ నవ్వుని ఆపుకుని, "విలువలు.. ఇంకా ఉన్నాయను కుంటున్నావా? ఐతే నువ్వు ఇంకా ఏ శతాబ్దంలో ఉన్నావ్? నా మూలాన ఏనాడో అవి మట్టిలో కలిసిపోయాయి."

"నీ మాటని నేనొప్పుకోను."

"అలా అయితే నీకభ్యంతరం లేకపోతే నా వెంట వస్తావా?"

"ఎందుకు?"

"నా మాటలు నిజమని నిరూపిస్తా"

"సరే పద" అని గూటిలోని పిల్లలకి కాసిన్ని జాగ్రత్తలు చెప్పి నోటుతోపాటే బయలుదేరింది పావురం.


అలా వెళుతూ వెళుతూ ఒక కాలనీలోని నాలుగు రోడ్ల కూడలి చేరుకున్నారు. మెల్లిగా వెళ్ళి కనిపించే ఓ పెద్ద బంగళా ఇంటి కిటికీ మీద వాలాయి నోటు, పావురం.

❋ ❋ ❋

లివింగ్ హాలులో రాణి తన ఫ్రెండ్ వాణితో పోచికోలు కబుర్లాడుతోంది. ఇంతలో బాల్కనీ నుండి చేతిలో సూట్‌కేస్‌తో అజయ్ పదేపదే వాచ్ చూసుకుంటూ గబగబా మెట్లు దిగాడు. బయటికి వెళ్తున్న అజయ్‌ని రాణి వారించి-

## ఈ లోకంలో

మూసిన గుప్పెటలా గుంభనంగా
నీ ప్రేమ...
తెరచిన అరచేయిలా తేటతెల్లంగా
నా ప్రేమ...
అని నేనంటే-
మనసు తెలియాలిగ అన్నావు
అయినా, నా మనసు నాదైతేగా
నీకు తెలియజెప్పడానికి
ఎన్నో ఏళ్ళ నా నిరీక్షణకు
ఎదురుపడ్డ
నీ చూపుల గాలానికి
చేపలా చిక్కుకుని
కొన ఊపిరితో,
అటో, ఇటో అన్నట్టున్న
నా మనసుని



వేరే తెలియజెప్పాలా?
ఇలాంటప్పుడు అన్పిస్తుంది
ఈ లోకంలో...
ఎందరో అపరిచితులున్నారు
వారిలో...
నీవు కూడా ఉండుంటే
ఎంత బావుణ్ణు!

- రోహిణీ సత్య

"ఏమండీ! టిఫిన్ చేసి వెళ్ళండి" అంది ప్రేమగా.

"నో నో నాకు టైం లేదు. నాకిప్పుడు ఇంపార్టెంట్ మీటింగ్ ఉంది." అంటూనే పోర్టికోలోనున్న ఫారిన్ కారులో తుర్రుమన్నాడు. ఇదంతా చూసిన వాణి, "ఏంటే మీ ఆయన చాలా బీజీగా ఉంటాడనుకుంటా. ఎప్పుడూ కాన్ఫరెన్స్‌లూ, విదేశీ టూర్స్.. వీటితోనే క్షణం తీరికి కూడా ఉండనట్టుంది. మన ఫ్రెండ్స్ చెబితే ఏమో అనుకున్నా, చూస్తేనే తెలుస్తోంది."

రాణి ఒకసారి నిట్టూర్చి, "ఔనే! ఆయనకు క్షణం తీరిక ఉండదు. ఎప్పుడు ఎక్కడుంటారో చెప్పలేం, ఆయన సెల్ చెప్పాల్సిందే" అంటూ ఇంపోర్టెడ్ సోఫాలో కూలబడింది.

"ఐతే నీతో గడిపేది కొన్ని నిముషాలే అన్నమాట?"

"నిముషాలు అనే బదులు క్షణాలంటే బావుంటుంది"

"ఇలాంటి బీజీ మాన్‌తో ప్రేమను సరిగ్గా పొందుతున్నావా?"

"ఉహు దాని గురించి ఎప్పుడైనా మాట్లాడుకుందాం కానీ.." అంటూ టాపిక్ మార్చే ప్రయత్నం చేసింది రాణి.

"మరి నిన్ను ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాడు కదే!" విసుగుతో కనుబొమలెగరేసి.

"ఫ్రాంక్‌గా చెప్పాలంటే అజయ్ నా అందాన్ని చూసి పెళ్ళి చేసుకున్నాడు. నేను ఆయన ఆస్తిని చూసి పెళ్ళి చేసుకున్నానని చెప్పొచ్చు."

"మరి మీ మధ్య లవ్.." సంశయంగా అంది వాణి.

"ఓసి పిచ్చిదానా! కలకాలం పార్కుల్లోనో, బీచ్‌ల్లోనో కళ్ళలోకి కళ్ళు పెట్టి ప్రేమగా చూసుకుంటే కడుపు నిండిపోతుందా? ఇవి సిన్మా ప్రేమలు కావు కదా ప్రేమే తిని బ్రతకడానికి. రియల్ లైఫ్‌లో హుందాగా జీవించడానికి, విలాసవంతంగా లైఫ్‌ని ఎంజాయ్ చేయటానికి మనీ కావాలి. అది అజయ్ దగ్గర కావాల్సినంత ఉంది. నిజం చెప్పాలంటే, నేనో మిడిల్ క్లాస్ (పుట్టిన) దాన్ని. ఇప్పుడు అనుభవిస్తున్న స్వర్గసుఖాలు కలలోనూ ఊహించలేదు తెలుసా? ఆయన పి.ఏ. స్థాయిలో ఉన్న నేను, మిసెస్ స్థాయికి వచ్చేలా కష్టపడ్డాను. కేవలం ఇవన్నీ అనుభవించటానికే. దానిక్కావాల్సింది డబ్బు. ఈ డబ్బు తెచ్చిన స్టేటస్ చూసే కదా! ఈ కాలనీ ప్రెసిడెంట్‌ను, మహిళామండలి ప్రెసిడెంట్‌ను కోరకుండానే చేశారు. అది నన్ను చూసి కాదు, నా వెనకున్న డబ్బును చూసి. ఇది గాక బిరుదులు- ఎముకలేని చెయ్యని, అపర దానకర్ణురాలని.. ఏనీ హౌ ఈ రోజు క్లబ్బుకు వస్తున్నావా లేదా?"

ఈ సంభాషణ విన్న నోటు, పావురం పక్కనున్న మరో ఇల్లు చేరాయి.

❋ ❋ ❋

"ఏంటండీ మీకు మతి ఉందా లేదా? ఇంత డబ్బు పెట్టి మీ అమ్మా నాన్నకు సమయం సందర్భం లేకుండా కొత్తబట్టలు

## రంగులు మారే రక్తం



జంతువుల శరీరంలోని రక్తం ఎర్రగా ఉంటుందని అందరికీ తెలుసు. కాని కొన్నిటిలో నీలిరంగు, మరికొన్నిటిలో ఆకుపచ్చగా ఉంటుంది. ఇంకా కొన్నిటిలో రంగే ఉండదు. ఇది వాటి వాటి లక్షణం.

కాని కొన్ని రకాల నీటి ఫ్లీలలో అవసరాన్ని బట్టి రక్తం రంగు మారడం ఒక విశేషం.

ఎరుపు రంగుకి కారణం రక్తంలోని హిమోగ్లోబిన్ అనే ఇనుము సంబంధ రసాయన పదార్థం. ఇది ఆక్సిజన్‌తో కలిసి ఆక్సీహిమోగ్లోబిన్‌గా మారుతుంది. తరువాత ఆక్సిజన్‌ను అన్ని ప్రాంతాలకు అందిస్తుంది.

మానవుల్లో ఒక విశేషం ఉంది. ఎత్తయిన ప్రాంతాలకు పోయినపుడు (ఎత్తయిన కొండలు, విమానంలో ప్రయాణం) అక్కడ వాతావరణంలో తగినంతగా ఆక్సిజన్ ఉండదు. అందువల్ల సుమారు 10 శాతం హిమోగ్లోబిన్ అధికం అవడానికి అవకాశం ఉంది.

కాని నీటి ఫ్లీలో హిమోగ్లోబిన్ విపరీతమైన మార్పులకు లోనవుతుంది. ఉదాహరణకు నీటిలో సమృద్ధిగా ఆక్సిజన్ ఉందనుకొందాం. వెంటనే హిమోగ్లోబిన్ చాలావరకు అదృశ్యమైపోతుంది. ఫ్లీ పాలిపోయినట్లయిపోతుంది. అంతే ఆరోగ్యానికేం ఇబ్బంది లేదు.

అలా కాక నీటిలో ఆక్సిజన్ బాగా తక్కువగా ఉందనుకోండి. రక్తం ఎర్రగా మిలమిలా మెరిసిపోతుంది అంతే హిమోగ్లోబిన్ అధికమయిపోతుంది. వీటినే ఆక్సిజన్ బాగా ఎక్కువ ఉన్న నీటిలోకి మార్చినట్లయితే మళ్లీ రక్తం వర్ణహీనమయిపోతుంది.

అంతేకాదు ఫ్లీలలో రక్తం పర్పుల్, ఆకుపచ్చ, నీలం, గోధుమరంగులలోకి మారిపోవడానికి అవకాశం ఉంది. ముందు ఈ రంగు కొన్ని అవయవాల్లో కనబడి తరువాత రక్తంలోకి ప్రవేశిస్తుంది.

**- జమ్మికోనేటిరావు**

తీసుకువచ్చారు" అని గయ్‌మంది భాను కుక్కర్ గ్యాస్ స్టౌవ్ మీద పెడుతూ.

"ఒసేయ్ అరవకే. నేనేమైనా పిచ్చివాణ్ణను కున్నావా? ఎన్నడూ లేంది ఇన్ని డబ్బులు పోసి కొనుక్కు రావటానికి వెధవననుకున్నావా?"

"మరి" అంది కళ్ళు మరింత పెద్దవి చేసుకుని.

"ఎలాగూ కొద్ది రోజుల్లోనే నాన్నగారు రిటైర్ అవ్వబోతున్నారు. ఆ తర్వాత ఆయన కొచ్చే డబ్బు లక్షల్లో ఉంటుంది తెలుసా?"

లక్షలు అనగానే ఆనందంతో భాను మొహం వెలిగిపోయింది.

"తర్వాత తర్వాత చెప్పండి" అంది ఆత్రుతతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూ.

"ఎలాగూ వారికి ఒక్కగాను ఒక్క కొడుకునే కదా! ఆయన తదనంతరం ఆ మొత్తం నాకే కదా! కానీ ఆయన పోయేదాకా వెయిట్ చేసే ఓపిక లేదు. అందుకని ఆ డబ్బు వచ్చే రోజు వరకు వారిని పువ్వుల్లో పెట్టి చూసుకుందాం. ఆ తర్వాత ఎలాగోలా ఆ డబ్బు లాగేద్దామనే నా ప్రయత్నం" అన్నాడు భార్య వంక చూస్తూ. భర్త వేసిన పథకానికి ఎగిరి గంతులేసి వాటేసుకుని ముద్దుల్లో ముంచేయాలన్నంత సంతోషానికి లోనయింది. తనలోనే తాను తమాయించు కుని,

"ఇంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాతే వారిని చూసుకోవడం నా వల్ల కాదు బాబూ! పిల్లలు, ఇంటి పనితోనే సతమతమయి పోతున్నా" అంది బుంగమూతి పెట్టుకుని.

"నువ్వేం వర్రీ కాకు. దీనికి ఓ ప్లాన్ వేసి ఉంచా. వాళ్ళు ఆ ఊరు విడిచి చస్తే ఈ సిటికీ రారు. వచ్చినా ఇక్కడే ఎక్కడో ఓ వోల్డేజ్ హోమ్‌లో పడేసి మంత్లీ ఇంత కట్టేస్తే సరి". ఈసారి మాత్రం భర్తని బుగ్గలు వాచేలా ముద్దుల వర్షంలో ముంచెత్తింది.

❋ ❋ ❋

"ఈ నైట్ ఫంక్షన్ గ్రాండ్‌గా చేస్తున్నాము వదినా" అంది పెరటి గోడ దగ్గర నిల్చుని పంకజం ఆవలి వైపున్న కామాక్షితో.

"అలాగా" అంది కామాక్షి బుగ్గలు నొక్కుకుంటూ.

"ఔనొదినా దాదాపు వెయ్యిమంది దాకా రావచ్చు"

"ఏంటీ బారసాలకే ఇంతమందా?" అంది విస్తుపోతూ కామాక్షి.

"మనుమడ్ని కావాలనుకున్నాం. పొందాం. అందుకే ఈ గ్రాండ్ ఫంక్షన్."

"అదికాదొదినా ఒక్కమాట. ఇది నా మాట మాత్రం కాదు. ఇరుగుపొరుగు అనుకుంటుంటే విన్నాను. మీ కోడలు రమకు నాలుగైదు అబార్షన్లు చేయించావటగా?" అంది కాస్త బెరకుగా.

"ఓహ్ అదా! నిజమే. నెల తప్పగానే స్కానింగ్ చేసి ఆడపిల్లని తెలియగానే తీయించేశాను. ఐనా ఈ రోజుల్లో కావాల్సింది మగ నలుసుకాని ఆడదెందుకు? ఒకవేళ పుడితే దాన్ని కంటికి రెప్పలా పెంచాలి? చెడు చూపు పడకుండా చూసుకోవాలి. ఓ అయ్య చేతిలో పెట్టాలా, అలా పెడితే వూరికే అత్తవారింటికి వెళుతుందా? లక్షలు మూటగట్టి చంకనపెట్టి పంపొద్దూ. ఐనా మన వంశం ఉద్ధరించడానికి, పున్నామనరకం నుండి తప్పించడానికి, అత్తవారింటి నుండి లక్షలు కట్నం తీసుకు రావటానికి మగపురుగు కావాలిగానీ ఈ ఆడదెందుకు?" అంది పంకజం సింపుల్‌గా.

"వాణ్ణి కనేది ఓ ఆడదే కదా!" అని పైకి అనాలని ఉన్నా, పంకజం గయ్యాళి నోరుకు భయపడి సాహసం చేయలేకపోయింది.

"హాస్పిటల్లో స్కానింగ్ చేసి ఆడో మగో అని చెప్పేది లేదని ప్రభుత్వం ఈ మధ్య ఓ చట్టం చేసిందిగా" అంది కామాక్షి.

"అవేవో మొక్కుబడి చట్టాలు. ఆచరణకు కాదు. ప్రభుత్వం చేసిన చట్టాల్లో జనం కనీసం కొన్నయినా ఆచరిస్తారంటావా? అందులో ఇది ఒకటి. ఐనా నాలుగు డబ్బులు పడేస్తే ఏ పనైనా ఇట్టే జరిగిపోతుంది. అన్నట్టు వదినా రాత్రికి మా ఇంట్లోనే మీ అందరికీ భోజనం."

❋ ❋ ❋

"ఊళ్ళో అంతా బాగున్నార్రా?" అన్నాడు నవ్వుతూ దయానంద్ తన క్లోజ్ ఫ్రెండ్ తిరుమలేశ్‌ను వాకిట్లోనే ఆలింగనం చేసు కుంటూ. లోపలికెళ్ళి కూర్చున్నారు. తన హేండ్ బ్యాగ్‌లోనున్న కూతురి పెళ్ళి కార్డుని దయానదండ్‌కు అందిచ్చాడు తిరుమలేశ్.

"చెప్పవేంట్రా మన వూరి విశేషాలు" అన్నాడు నంద్.

"అంతా బాగానే ఉన్నారు" అన్నాడు ముక్తసరిగా.

కవర్ లోంచి కార్డు తీసి చదివాడు.

"అంటే పెద్దమ్మాయి పెళ్ళన్నమాట. ఎంత ఉండేదిరా చూస్తుండగానే పెళ్ళికెదిగింది."

"ఇంట్లో ఎవరు లేర్రా?"

"పక్క వీధిలో పెళ్ళికెళ్ళారు"

చాలాసేపు తమ చిన్ననాటి కబుర్లు, చేసిన కొంటె పనులు, చూసిన సిన్మాలు నెమరేసుకున్నారు.

"మరి తమ్ముడు" అన్నాడు నంద్ అప్రయత్నంగా. ఆ మాట వినగానే తిరుమలేశ్ ముఖం వివర్ణమైంది. కళ్ళల్లో చింతనిప్పులు కురిపిస్తూ, పళ్ళు పటపటా కొరికాడు.

"వాడి వూసు నా దగ్గరెత్తకు" అన్నాడు ఆవేశంతో పూనకం వచ్చిన వాడిలా వూగిపోతూ.

"ఏమైందిరా?"

"నాన్న పోయే ముందు బలవంతంగా వీలునామా తన పేర రాయించుకొని లక్షల ఆస్తిపరుడయ్యాడు. వాణ్ణి వదిలిపెట్టను. నాకు చిల్లిగవ్వ రాకుండా ప్లాన్ ప్రకారం చేశాడు. ఎంత డబ్బు ఖర్చయినాసరే వాణ్ణి లేపేయిస్తాను" అంటున్న తిరుమలేశ్ రొమ్ములు ఆవేశంతో ఎగిసిపడుతున్నాయి.

"వాడు నీ సొంత తమ్ముడు కదరా?"

"ఐతే నాకే ద్రోహం చేస్తాడా? ఆస్తిలో నాకు రావాల్సిన నా సగం వాటా వాడే కొట్టేస్తాడా?"

"రిలాక్స్ రిలాక్స్ రా హోటల్‌కెళ్దాం పదా" ఆవేశం చల్లార్చే ఉద్దేశంతో నంద్ టాపిక్ డైవర్ట్ చేశాడు.

"తర్వాత వెళ్దాం. కానీ నేనిచ్చిన డబ్బులు ఇచ్చేస్తే వెళతాను. అవతల ఇంకా పెళ్ళి పనులు చాలా ఉన్నాయి. పెళ్ళికి ఇంకా వారం రోజులే ఉంది."

"నిన్న నేను ఫోన్ చేసి మేటర్ మొత్తం చెప్పాను కదా! 'నేను దాచిపెట్టిన బ్యాంక్ డైరెక్టర్స్ పరారీలో ఉన్నారు. వారు దొరకగానే.."

"అంటే నీ ఉద్దేశం చచ్చేదాకా ఉండు పెళ్ళి చేస్తా అన్నట్టా?"

"అది కాదురా! నీకిద్దామనే తెచ్చిన డబ్బు బ్యాంకులో దాచిన మరునాడే బోర్డు తిప్పారు."

"కాకమ్మ కథలు నాకు చెప్పకు. నాకు డబ్బు కావాలి. నువ్వేమి చేస్తావో నాకనవసరం. రేపటిలోగా డబ్బు నా చేతిలో ఉండాలి"

"ఇంత త్వరగా అంటే ఎలారా? నాకు కొన్ని రోజుల టైం కావాలి"

"ఎన్ని రోజులు కావాలి? ఓ వంద సంవత్సరాలు ఇవ్వనా? సిగ్గు లేకపోతే సరి. ఇప్పటికి ఎన్నిసార్లు టైమిచ్చానురా? క్లోజ్ ఫ్రెండ్‌వి కదాని వూరుకుంటుంటే బ్యాంక్ దివాలా తీసిందని చెప్పి, నా నెత్తిమీదే శఠగోపం పెడదామను కుంటున్నావా?"

"నన్ను నమ్మరా బాబూ" అన్నాడు నంద్ అభ్యర్థనగా.

"నేను నమ్మనురా. ఏమీ గతిలేని నీకు అంతడబ్బు ఇవ్వటం నేను చేసిన తప్పు. మనిషన్నప్పుడు మాట మీద నిలబడాలిరా. మనిషికో మాటా గొడ్డుకో దెబ్బ అన్నారు."

"మాటలు తిన్నగా రానీ" హెచ్చరిస్తున్నట్టుగా నంద్ స్వరం.

"అంత పౌరుషం ఉన్నవాడివైతే కింద పడేయ్‌రా. ఏరుకుని పోతాను. కట్టడం చేతకానప్పుడు తీసుకోవడమెందుకు? నా ఇంటి ముందుకు వచ్చి భిక్షగాడిలా దేహి అనడమెందుకు?"

"ఓరేయ్ తిరుమలి మాటలు తిన్నగా రానీ" అన్నాడు నంద్ చూపుడు వేలుతో బెదిరిస్తున్నట్టుగా.

"ఏంట్రా రెచ్చిపోతున్నావు? నాకే వార్నింగ్ ఇస్తున్నావా? చేతగానివాడివి అలానే ఓ మూలన పడి ఉండు"

వీరి వాగ్వివాదానికి ఇరుగు పొరుగు గుమికూడారు. అక్కడున్న ప్రతి ఒక్కరికీ విషయమంతా పూసగుచ్చినట్టు చెప్పాడు తిరుమలేశ్. నంద్ సిగ్గుతో సగం చచ్చిపోయాడు.

"ఓరేయ్ నందుగా రేపొస్తా ఉన్న ఇల్లు అమ్ముతావో, పెళ్ళాం మీది నగ, నట్రా అమ్ముతావో నాకు తెలియదు. కానీ రేపు నేను వచ్చేసరికి నా డబ్బు నా చేతిలో ఉండాలి. తెలిసిందా?"

"ఓరేయ్ నువ్వు నా పరువుని రచ్చకీడ్చావు. ఇంతసేపు వూరుకున్నాను. ఇక నా దగ్గర ఉన్నప్పుడు ఇస్తాను. ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకు పో. నీ దిక్కున్న చోట చెప్పుకో పో. నువ్వు నన్నేమీ చేయలేవు పోరా. నీకు బాకీ ఉన్నట్టు నోటుందా? చిన్నకాగితం ముక్కయినా ఉందా?"

"ఓరేయ్" అంటూ తిరుమలేశ్, నందు కలబడ్డారు. చొక్కాలు చింపుకున్నారు. అక్కడున్న వారు బలవంతంగా విడదీశారు. తిరుమలేశ్ చొక్కా సవరించుకుంటూ,

"ఓరేయ్ నీ సంగతి చూస్తారా నీ అంతు చూస్తా"

"నీ మొహం నన్నేమీ చేయలేవు పోరా" తిరుమలేశ్ అక్కడ నుండి విసవిసా అందరినీ దాటుకుంటూ వెళ్ళాడు.

❋ ❋ ❋

నోటు, పావురంతో, "కపోతమా! మరో ఇంటికి వెళ్దామా?"

"చాలు మహానుభావా చాలు. నీ మహిమలు నీ లీలలు తెలుసుకున్నాను. నీవల్లే మంచివాళ్ళు చెడ్డవాళ్ళవుతున్నారు. స్నేహితులు విడిపోతున్నారు. ద్రోహాలకు పాల్పడుతున్నారు. ఇంకా నీ గురించి ఎంత చెప్పినా తక్కువే" అని తోక ముడుచుకుని తన గూటి వైపు సాగింది పావురం. ❋

